# సాక్షి అనకాపల్లి

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025






## నిరసనల హోరు

పీజీఆర్ఎస్ సందర్భంగా కలెక్టరేట్ వద్ద సోమవారం పలు సంఘాల వారు ధర్నాలు చేశారు. 8లో

**ఉష్ణోగ్రతలు**

సోమవారం

| | | గరిష్టం/కనిష్టం |
|---|---|---|
| అనకాపల్లి | : | 35.8/26.8 |
| చోడవరం | : | 38.0/27.0 |




## ముస్లింల నిరసన

వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించాలంటూ ముస్లింలు నర్సీపట్నంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. 8లో

# అంతం కాదిది.. ఆరంభం

ఒత్తిడి వద్దు.. ఒకరితో పోలిక వద్దు.. ఓటమి దగ్గరే ఆగిపోవద్దు.. కుంగిపోవద్దు.. నిరాశలో కూరుకుపోవద్దు.. టెన్త్, ఇంటర్ పరీక్షలు తప్పితే కొందరు జీవితం వృథా అనుకుంటారు.. అంతమొందించుకుంటారు.. తమ కలల్ని తుంచేసుకోవడమే కాక కన్నవారికి కన్నీళ్లు మిగులుస్తారు. ఆగి కాస్త ఆలోచిస్తే, వాస్తవాలను గ్రహిస్తే పరిష్కారం లభిస్తుంది. జీవితాన్ని సరైన మార్గంలో పెడితే ఊహించనంతటి ఉన్నత స్థానం దక్కుతుంది. ఇది చరిత్ర చెబుతున్న నిజం. ఎందరో స్ఫూర్తిదాతల జీవితాలే అందుకు నిదర్శనం.




**ఓటమే విజయానికి తొలి మెట్టు**

**పరీక్ష ఫెయిలయితే తల్లడిల్లవద్దు**

**విజేతలను చూసి స్ఫూర్తి పొందాలి**

అమృతాపురం రూరల్: పరీక్ష **ఫలితాలు** వెలువడినప్పుడల్లా కొన్ని వి**షాద వార్తలు** వినాల్సివస్తుంది. ముఖ్యంగా **టెన్త్, ఇంటర్** విద్యార్థులు చాలా **తొందరపాటు** నిర్ణయాలు తీసుకుంటారు. **ఈ పోటీ** ప్రపంచంలో నిలదొక్కుకో**లేకపోయాం..** బతికి ఏం సాధిస్తామన్న నైరాశ్యం వారిని తీవ్ర నిర్ణయాల వైపు నడిపిస్తుంది. విద్యావేత్తలు, మానసిక శాస్త్రవేత్తలు చెప్పేదేమిటంటే.. అది అంతం కాదు ఆరంభం మాత్రమేనని.. ఔను. ఇంటర్మీడియట్ పేరులోనే ఉంది.. విద్యార్థి దశలో అదో మలుపు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల చదువుకు.. పట్టభద్రులయ్యే దశకు మధ్య **కాలం. అంతకుముందే సరైన మార్గంలో నడిస్తే మంచిదే. కనీసం ఆ దశలోనైనా తమ దిశ మార్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు ముందు ఉంటుంది. ఒకసారి** పరీక్ష తప్పిన వారు దెబ్బ తిన్న పులిలా పట్టుదలతో చదివితే కనీవినీ ఎరుగని విజయాలు సాధిస్తారు. అయితే అందుకు తల్లిదండ్రులు, గురువులు, స్నేహితుల నుంచి.. ఒక్క మాటలో చెప్పాలంటే సమాజం నుంచి ఊరడింపు కావాలి. ప్రోత్సాహం లభించాలి. అప్పుడే వారు నిలదొక్కుకోగలుగుతారు. వారు చదువులోనే ఇష్టమైన **మరో విభాగాన్ని** ఎంచుకోవచ్చు లేదా ఇష్టమైన మరేదైనా రంగంలోకి మారి నైపుణ్యం సాధించవచ్చు. అంతమాత్రానికే అంత కుంగిపోవడం ఎందుకు.. వ్యక్తిత్వ వికాస నిపుణులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు చెబుతున్న మాట ఇదే.

## పడి లేచిన కెరటం



**బం**గారు సత్యనారాయణ.. పేరుకు తగ్గట్టే బంగారం లాంటి వ్యక్తిత్వం. పదో తరగతిలో ఫెయిల్ అయినా నిరుత్సాహపడలేదు. కసిగా చదివారు. సప్లిమెంటరీలో పాసయ్యారు. పట్టుదలగా చదివి ఇంటర్‌లో ఏకంగా నర్సీపట్నం జూనియర్ కాలేజీలో ప్రథమ స్థానంలో నిలిచారు. 1990లో టెన్త్ పరీక్ష తప్పిన సత్యనారాయణ.. 1998 నాటికి టీచర్ ట్రెయినింగ్ కోర్సు (టీటీసీ)లో విజయుడై ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూ డిగ్రీ, ఎంఏ హిస్టరీ, ఎంఏ పాలిటిక్స్, ఎంఏ సోషియాలజీ చేశారు. సొంత గ్రామం అయిన గొలుగొండ మండలం అమ్మపేటలో ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా రావడం జీవితంలో మరచిపోలేని మధురానుభూతి అంటారు సత్యనారాయణ. ఆయన అక్కడితో ఆగిపోలేదు. 2021లో గ్రూప్–2కు ఎంపికై పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం నర్సీపట్నంలో పనిచేస్తున్నారు. పదో తరగతి ఫెయిల్ కావడంతో గ్రామంలో అందరూ చిన్న చూపు చూశారని, అది తనలో పట్టుదల పెంచిందని సత్యనారాయణ 'సాక్షి'కి వివరించారు. తల్లిదండ్రులు, కొంతమంది టీచర్ల ప్రోత్సాహంతో మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగానని, అనతికాలంలో విజయ తీరాలను చేరుకున్నానని చెప్పారు. కష్టపడిన వారికి ఎప్పుడూ చెడు జరగదని, పరీక్ష తప్పామని నిరాశ చెందకుండా ఎలాంటి పొరపాట్లు చేశామో ఆత్మ విమర్శ చేసుకుంటే ఆ గడ్డు పరిస్థితి నుంచి బయటకు రాగలమన్నారు. –గొలుగొండ

## పిల్లల ఆలోచనలకు విలువ ఇవ్వండి



తల్లిదండ్రులు కొంత సమయాన్ని తమ పిల్లలతో గడపాలి. వారి ఆలోచనలు, అభిరుచులు తెలుసుకునే ప్రయత్నం చేయాలి. వారి అభిమతానికి విలువ ఇవ్వాలి. పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా తమ వద్ద చెప్పుకునే వాతావరణం కల్పించాలి. చదువు విషయంలో తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తీసుకురాకుండా వారికి భవిష్యత్తులో ఏమి అవ్వాలని అనుకుంటున్నారో తెలుసుకుని ప్రోత్సహించాలి.

–దేవరాయలు, మండల విద్యాశాఖాధికారి

## క్రీడా నైపుణ్యంతోనూ పైకి రావచ్చు

విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో సీట్లు సాధించి పైకి ఎదగవచ్చు. అదే కోటాలో ఉద్యోగాలూ సాధించవచ్చు. క్రీడల్లో సంపాదించిన సర్టిఫికెట్లు భవిష్యత్తులో ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పడతాయి. ఎన్‌సీసీ, స్విమ్మింగ్, కరాటే, తైక్వాండో, కిక్ బాక్సింగ్, స్కేటింగ్ వంటి క్రీడలు ట్రెనర్ సహాయంతో నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



–రెడ్డి చిరంజీవి, కైట్స్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్

## ఔను..నేను పరీక్ష తప్పాను

**యూపీ అదనపు డీజీపీ సత్యనారాయణ**



**కోటవురట్ల:** ఆయన పదో తరగతి సెకండ్ క్లాస్‌లో పాసయ్యారు. ఇంటర్ పరీక్ష తప్పారు. మొదటి ప్రయత్నంలో పాసై ఉంటే ఏ గుమస్తా గానో.. ఏ ఇంజినీరుగానో మిగిలి పోయేవారు. ఆత్మ విమర్శ చేసుకొని.. తప్పటడుగు ఎలా పడిందో తెలుసుకొని తన రూట్ మార్చుకున్నారు. నేడు రాష్ట్రం ఎల్లలు దాటి దేశమంతటా తన సేవలందిస్తున్నారు. ఇది ఓ ఐపీఎస్ విజయగాథ. ఆయన ఎందరికో స్ఫూర్తి ప్రదాత. కోటవురట్ల మండలం పాములవాక గ్రామంలో సాధారణ కుటుంబంలో పుట్టిన కిల్లాడ సత్యనారాయణ.. ఉత్తరప్రదేశ్‌లో ట్రాన్స్‌పోర్ట్ అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్థాయికి ఎదిగారు. ఇంటర్ ఫెయిల్యూర్ నుంచి తన జీవన ప్రస్థానాన్ని 'సాక్షి'కి వివరించారు.

ఔను.. నేను పరీక్ష తప్పాను. నర్సీపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాను. నిరుత్సాహపడకుండా తప్పు ఎక్కడ జరిగిందో ఆలోచించాను. గ్రూపు ఎంపిక సరిగా లేదని అర్థమయింది. డిగ్రీ నుంచి ఆర్ట్స్ వైపు నా దారి మార్చుకున్నాను. బీఏ తరువాత ఎంఏ ఎకనామిక్స్, హిస్టరీ చేశాను. బీఈడీ పూర్తి చేసి టీచర్‌గా ఉద్యోగంలో చేరాను. మీకు మరో విషయం చెప్పాలి. ఇంటర్ అయ్యాక ఖాళీగా ఉండలేక విశాఖలోని డాక్‌యార్డులో నా మిత్రుడు రుత్తల సత్తిబాబుతో కలిసి పనిచేయడానికి వెళ్లాను. ఇరవై రోజులపాటు కష్టపడ్డాను. బరువులు మోయడం, ఎత్తడం వంటి పనులతో నా చేతులు బొబ్బలెక్కేవి. అపుడు నిర్ణయించుకున్నాను దారి మార్చుకోవాలని.. ఇంటర్ పాసై చక్కని ప్రణాళికతో ఈ స్థాయికి వచ్చాను.


**లక్ష్య సాధన కోసం..**

లక్ష్యాలు ఎప్పుడూ పెద్దగా ఉండాలి. వాటిని సాధించడానికి కష్టపడాలి. టీచర్ ఉద్యోగంతో సంతృప్తి పడలేదు నేను. నక్కపల్లి మండలంలో పనిచేస్తుండగానే సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యాను. ప్రిలిమినరీ పూర్తి చేసి, మెయిన్స్ కోసం చదవడానికి ఎంఈవోను మూడు నెలల సెలవు అడిగాను. ఆయన నిరాకరించడంతో నాలో కసి పెరిగి ఉద్యోగానికి రాజీనామా చేసి చదువుపై దృష్టి పెట్టాను. ఐపీఎస్ సాధించి, ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు వెళ్లాను. ఆగ్రాలో ఏఎస్పీగా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఎస్పీగా నక్సల్స్ ప్రభావిత జిల్లా సోన్‌భద్రలో, డీఐజీగా మీరట్‌లో సేవలందించాను. కొన్నాళ్లు ఏపీలో డిప్యుటేషన్‌పై పనిచేశాను. ప్రస్తుతం లక్నోలో ట్రాన్స్‌పోర్టు అదనపు డీజీపీగా విధులు నిర్వహిస్తున్నాను.

**అపజయమంటే అంత భయమెందుకు?**

విజయం ఒక్కటే జీవితం కాదు. ఫెయిల్యూర్ వచ్చిందని బతుకును అంతం చేసుకోవడం కరెక్ట్ కాదు. ఉదాహరణకు ఐఏఎస్ కావాలనుకుంటాం.. కాకపోయినంత మాత్రాన పట్టాలపై బుర్ర పెట్టాల్సిన పనిలేదు. అది కాకపోతే ఇంకొకటి.. ఏ టీచరో అవుతాం. అదీ కాకపోతే ఏ దుకాణమో పెట్టుకుంటాం. పిల్లలు ఒత్తిడికి లోనైనప్పుడు ..అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తల్లిదండ్రులు నేర్పుగా ఓపికతో వ్యవహరించాలి.

## స్థిరపడేందుకు అనేక రంగాలున్నాయి..



జీవితంలో స్థిరపడాలంటే ఈరోజుల్లో చదువు ఒక్కటే సరిపోదు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో నైపుణ్యం కలిగి ఉంటాలి. ఐటీఐ., పాలిటెక్నిక్, కంప్యూటర్ స్కిల్స్, యానిమేషన్, ఫోటోగ్రఫీ, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్స్, గార్మెంట్స్, కన్‌స్ట్రక్షన్ వర్క్స్, బ్యూటీ పార్లర్, కుట్లు అల్లికలు వంటి అనేక రంగాల్లో రూ.50 వేలకు పైగా సంపాదిస్తున్నవారున్నారు. చదువుపై ఆసక్తి లేనివారు ఇలాంటి రంగాన్ని ఎంచుకోవచ్చు. జీవితంలో ఎదగాలన్న తపన, పట్టుదల ఉండాలి. అదే ఉన్నత స్థానానికి తీసుకువెళ్తుంది.

–పల్లి శేషగిరిరావు, అచ్యుత ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్

## న్యూస్‌రీల్

### 13 మందికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామకాలు పొందిన సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

**అనకాపల్లి:** ప్రభుత్వ శాఖల్లో అంకితభావంతో విధులు నిర్వహించాలని కారుణ్య నియామకాలు పొందిన వారికి ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. విధులు నిర్వహిస్తూ మృత్యువాత పడిన పోలీస్ సిబ్బంది కుటుంబాల్లో 13 మందికి నియామకాల పత్రాలను సోమవారం ఆయన తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరో నలుగురిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

### బాల్య వివాహాల కట్టడిలో పోలీసులు కీలకం



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

**అనకాపల్లి టౌన్:** బాల్య వివాహాలు పూర్తిగా కట్టడి చేయాలని, అందుకు మహిళా పోలీసుల పాత్ర కీలకమైనదని ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ సూర్యకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీనేజ్ ప్రెగ్నెన్సీపై దృష్టి సారించి, దానివల్ల కలిగే అనర్థాలపై ఎక్కువగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. శిశు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్లు త్వరగా మంజూరయ్యాలా తగిన చర్యలు చేపట్టాలని జేసీ జాహ్నవిని ఆదేశించారు. సివిల్ సప్లయి, వన్ స్టాప్ సెంటర్, ఓఎస్సీ పనితీరుపై ఆరా తీశారు. షీ బాక్స్ ఏర్పాటుపై తగు సూచనలు చేశారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ఎక్కువగా హోమ్ విజిట్ చేయాలన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 112ను ఎక్కువగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ ఎల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ రథయాత్రకు నీరాజనం



కశింకోట చేరిన ఇస్కాన్ రథయాత్రలో ఊరేగిస్తున్న రాధాకృష్ణులు



గౌరీ హారతి అందుకుంటున్న భక్తులు

**కశింకోట:** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) సనాతన ధర్మాన్ని మేల్కొల్పడానికి దేశ వ్యాప్తంగా చేపట్టిన ఏడో రథయాత్రకు సోమవారం రాత్రి కశింకోటలో భక్తులు నీరాజనాలు పలికారు. స్థానిక సత్యసాయి మందిరం నుంచి రాధాకృష్ణుల విగ్రహాలను ఎడ్ల బండిపై సంతబయల వరకు ఊరేగించారు. ఆ సమయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేసి గౌరీ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఇస్కాన్ సంస్థాపక ఆచార్య అభయ చరణారవింద భక్తి వేదాంతస్వామి, ప్రతినిధులు మాట్లాడుతూ దీన్ని ద్వారక నుంచి ప్రారంభించి కేథార్‌నాథ్, బద్రీనాథ్, బృందావనం, అయోధ్య, జనకపూర్, మాయాపూర్, పూరి జగన్నాథ్, శ్రీకూర్మం, సింహాచలంలో నిర్వహించామన్నారు. తర్వాత మంగళగిరి, తిరుపతి, అహోబిలం, రామేశ్వరంల మీదుగా కన్యాకుమారికి చేరడంతో యాత్ర ముగుస్తుందన్నారు. రామాయణం, భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- యలమంచిలిలో ఉత్కంఠ
- ఐదుగురు వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లతో ఊటీలో 'కూటమి' శిబిరం



యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

**యలమంచిలి రూరల్:** మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం నోటీసుపై మంగళవారం బలపరీక్ష నిర్వహించనున్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక సమావేశానికి నర్సీపట్నం ఆర్డీవో ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్నా రు. ఇందుకోసం యలమంచిలి పురపాలకసంఘ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వైఎస్సార్‌సీపీ సభ్యులకు ప్రలోభాల ఎర**

యలమంచిలి మున్సిపాలిటీలో మొత్తం 25 మంది వార్డు సభ్యులున్నారు. మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీకి 23 మంది సభ్యులు, టీడీపీకి ఒకరు ఉన్నారు. మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చైర్ పర్సన్‌గా ఎన్నికైన రమాకుమారి ఇటీవల బీజేపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాలమేరకు వార్డు కౌన్సిలర్లు జిల్లా కలెక్టరుకు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. నోటీసుపై 18 మంది వైఎస్సార్ సీపీ సభ్యులు సంతకాలు చేశారు. వీరిలో ఐదుగురు సభ్యులకు రమాకుమారి వర్గీయులు ప్రలోభాలు చూపి 20 రోజుల క్రితం ఊటీలో ప్రత్యేక శిబిరానికి తరలించారు. అవిశ్వాసం నెగ్గాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 17 మంది సభ్యుల మద్దతు అవసరం. అవిశ్వాసం వీగిపోవడానికి చైర్ పర్సన్ రమాకుమారి వర్గీయులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రలోభపెట్టిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ఊటీ నుంచి నేరుగా మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో జరిగే అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశానికి తీసుకురానున్నట్టు తెలిసింది.

## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

**అనకాపల్లి టౌన్:** జిల్లాలో ఏపీ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సోమవారం తెలిపారు. ఈ పరీక్షకు 1,704 మందికిగాను 1,483 మంది హాజరయ్యారని, 211 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మునగపాక మండలం పాటిపల్లి, కశింకోట మండలం తేగాడ, రావికమతం మండలం మరుపాక, చీడికాడ మండలం మంచాల, నర్సీపట్నం మండలం వేములపూడి మోడల్ స్కూళ్లలో 500 సీట్లు ఉన్నాయన్నారు. వేములపూడి, తేగాడ కేంద్రాలను తనిఖీ చేశామన్నారు.

## భానుడు భగభగ..

# మీటర్ గిరగిర!



- మండుతున్న ఎండలతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- విశాఖ సర్కిల్ పరిధిలో రోజూ సాధారణ వినియోగం 12 మిలియన్ యూనిట్లు
- ప్రస్తుతం 14–15 మిలియన్ యూనిట్లకు..
- ఒక్కసారిగా లోడ్ పెరగడంతో సరఫరాలో లోపాలు

**సాక్షి, విశాఖపట్నం:** ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందడానికి అంతా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు విపరీతంగా వినియోగిస్తున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంటోంది. సాధారణంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మార్చి మూడో వారం నుంచి నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో కరెంటు వినియోగం కూడా పెరుగుతుంటుంది. కానీ ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచి ఎండలు మండిపోతున్నాయి. అప్పటి నుంచి డిమాండ్ పీక్స్‌కు వెళ్లిపోయింది. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. లోడ్ పెరుగుతుండటంతో సరఫరాలోనూ లోపాలు తలెత్తుతున్నాయి.

### 2 మిలియన్ యూనిట్లు అదనంగా...

**వి**శాఖ సర్కిల్ పరిధిలో ప్రతి రోజూ సగటున 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంది. అయితే భానుడి ప్రతాపంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. గత కొద్ది వారాలుగా సగటు విద్యుత్ వినియోగం రోజుకు 14 నుంచి 15 మిలియన్ యూనిట్లుగా మారిపోయింది. ఏప్రిల్ 1న రికార్డు స్థాయిలో 15.976 మిలియన్ యూనిట్లు విద్యుత్ వాడేశారంటే.. ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు ప్రజలు ఎంతలా కరెంట్ వినియోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత వారం రోజులుగా పరిశీలిస్తే ఏ రోజూ 14 మిలియన్ యూనిట్లకు దిగువన రీడింగ్ లేదు.

| తేదీ | వినియోగం (మిలియన్ యూనిట్లలో) |
|---|---|
| 15- ఏప్రిల్ | 14.196 |
| 16- ఏప్రిల్ | 14.464 |
| 17- ఏప్రిల్ | 15.612 |
| 18- ఏప్రిల్ | 15.060 |
| 19- ఏప్రిల్ | 15.074 |
| 20- ఏప్రిల్ | 14.454 |

### ఆ గంటల్లో.. మంటలే..!

**ఇ**క మిట్ట మధ్యాహ్నం సమయంలో నడినెత్తిన సూరీడు తాండవమాడుతున్న సమయంలో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంటోంది. అదేవిధంగా రాత్రి 10 గంటల సమయంలోనూ డిమాండ్ పెరుగుతోంది. ఈ సమయంలో సరఫరా కంటే 3 నుంచి 5 మెగావాట్లు అధికంగా వినియోగిస్తున్నారు.

| తేదీ | మధ్యాహ్నం 1 గంటకు వినియోగం (మెగావాట్లలో) | రాత్రి 10 గంటలకు వినియోగం (మెగావాట్లలో) |
|---|---|---|
| 17–ఏప్రిల్ | 25.464 | 29.246 |
| 18–ఏప్రిల్ | 26.741 | 29.952 |
| 19–ఏప్రిల్ | 27.552 | 30.434 |
| 20–ఏప్రిల్ | 27.857 | 31.272 |

### డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తున్నాం..




**రో**జు రోజుకీ ఎండలు పెరిగిపోతున్నాయి. దానికనుగుణంగా విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. పెరిగిన విద్యుత్ కనెక్షన్లు, వాటి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మే నెలలో మరింత ఎక్కువగా డిమాండ్ ఉండబోతోంది. దానికోసం ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒకే సమయంలో అందరూ ఏసీలు, కూలర్లు ఆన్ చేస్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో లోడ్ పెరిగి ట్రిప్ అవుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీన్ని కూడా తక్కువ సమయంలోనూ పరిష్కరిస్తున్నాం. ఎంత అవసరమైనా కోతలు లేకుండా విద్యుత్ అందించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్యామ్‌బాబు, ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

### గరిష్ట స్థాయికి చేరుకుంటున్న డిమాండ్

**ఉ**మ్మడి విశాఖ సర్కిల్(అనకాపల్లి, అల్లూరి జిల్లాలు)లో విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. అందుకనుగుణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకునేందుకు ఈపీడీసీఎల్ అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉమ్మడి విశాఖ సర్కిల్ పరిధిలో సగటు వినియోగం 24 నుంచి 25 మిలియన్ యూనిట్లుగా ఉంది. ప్రస్తుతం 26 నుంచి 27 మిలియన్ యూనిట్లకు పైగా కరెంట్ ఖర్చవుతోంది. సరఫరాకు మించి వినియోగం ఉండటంతో అధికారులు లోటు భర్తీ చేసేందుకు ఎప్పటికప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి జిల్లాల్లో లలితా త్రిపురసుందరీ ఫెర్రో అల్లాయిస్, అభిజిత్ ఫెర్రో అల్లాయిస్ వంటి భారీ పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వకపోవడంతో మూతపడ్డాయి. ఈ కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా తగ్గింది లేదంటే.. 28 నుంచి 30 మిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



## క్లుప్తంగా

### రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు

**విశాఖ విద్య:** ఆంధ్ర యూనివర్సిటీ డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 23 నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని వర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు వెల్లడించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్, బీహెచ్ఎంసీటీ కోర్సులు చదువుతున్న 51,400 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సెకండ్ సెమిస్టర్ హానర్స్, సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. నాల్గో సెమిస్టర్ హానర్స్, సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రతీ రోజూ మధ్యాహ్నం 2 గంటల నంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించేలా ఇప్పటికే కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చామని రిజిస్ట్రార్ ధనుంజయరావు తెలిపారు.

### 24 నుంచి టీచర్స్‌కు మెడికల్ క్యాంపులు

**విశాఖ విద్య:** ఉపాధ్యాయుల బదిలీల కోసం.. వైద్య సంబంధిత ధృవీకరణ పత్రాల జారీకి ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. కేజీహెచ్, ప్రభుత్వ మెంటల్ ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 24న విశాఖ, 25న అనకాపల్లి, 26న అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. గతంలో పొందని వైద్య సంబంధిత ధ్రువపత్రాలను కూడా వెంట తీసుకురావాలన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో వైద్య పరమైన కేటగిరీ పాయింట్లు పొందేందుకు తప్పనిసరిగా జిల్లా స్థాయి మెడికల్ బోర్డుచే కొత్తగా సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు.

### బంగారుమెట్టలో పాక, గడ్డివాము దగ్ధం

**బుచ్చెయ్యపేట:** బంగారుమెట్ట గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక, గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన జక్కన పైడినాయుడు పశువుల పాక వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిపారేసిన సిగరెట్టు కారణంగా మంటలు చెలరేగాయి. పశువుల పాకకు మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. పశువులను మేతకు తీసుకెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న రావికమతం అగ్నిమాపక సిబ్బంది గంగరాజు, శివయ్య, నాయుడు, నాగేశ్వరరావు, సత్యప్రసాద్, తదితర్లు వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

# మండుటెండలో నిరసనల హోరు

- ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- ప్రతి వారం క్యూ కడుతున్నా పరిష్కారం కాని సమస్యలు
- అర్జీదారులకు తప్పని పాట్లు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు, ఇతర అధికారులు



సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

**తుమ్మపాల:** జిల్లా కలెక్టరేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. తమ సమస్యల పరిష్కారం కోసం పలువురు మండుటెండను సైతం లెక్క చేయకుండా నిరసనలతో హోరెత్తించారు. ప్రతి వారం స్వీకరిస్తున్న అర్జీలపై ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం చూపుతుండడంతో అర్జీదారులకు అవస్థలు తప్పడం లేదు. అర్జీదారులు కలిసి ఫొటో తీసుకుంటే చాలు సమస్య పరిష్కరించినట్లు ముగింపు ఎండార్స్‌మెంట్‌ను అధికారులు పంపిస్తున్నారు. గంపెడాశలతో సుదూర ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వస్తున్నా సమస్యల పరిష్కారం కాకుండా అధికారులే కొత్త కొర్రీలు వేస్తుండడంతో అర్జీదారులు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నారు. అనకాపల్లి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బుద్ధ శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో తలెత్తిన భూసమస్య పరిష్కారానికి ఆరు నెలలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టరేట్ గేటు వద్ద సోమవారం పెట్రోల్ పోసుకుని నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా నిరసన బాట పట్టారు. 2016లో పెట్రో యునివర్సిటీ పేరుతో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిరంకుశంగా తమ భూములను లాక్కుని నష్టపరిహారం చెల్లించకపోవడంపై కోర్టుకు వెళ్లామని, తీర్పును అమలు చేస్తూ తమకు పరిహారం మంజూరు చేయాలని సబ్బవరం మండలం వంగలి గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

**నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం: జేసీ జాహ్నవి**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జేసీ ఎం.జాహ్నవి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి తీసుకున్న వినతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కాని వినతులపై స్పష్టత ఇవ్వాలన్నారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని ఆమె సూచించారు. మొత్తం 320 అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, మెప్మా పీడీలు శచీదేవి, కె.అనంతలక్ష్మి, సరోజినీ, జిల్లా అటవీ శాఖ అధికారి లక్ష్మణరావు, జిల్లా సర్వే భూరికార్డుల సహాయ సంచాలకుడు గోపాల్‌రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

**మోసం చేసిన మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి**

తమ భూములు, ఇళ్ల రికార్డులను తారుమారు చేసి, సంతకాలు ఫోర్జరీ చేసి వివిధ బ్యాంకుల్లో లక్షలాది రూపాయలు రుణాలు పొంది తమను మోసం చేసిన మాజీ సర్పంచ్, బ్యాంకు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కలెక్టరేట్ ఎదుట కె.కోటపాడు మండలం కింతాడ శివారు జోగన్నపాలెం గ్రామస్తులు ధర్నా చేశారు. కూలీ పనులు చేసుకుంటూ జీవించే తమకు తీవ్ర అన్యాయం చేసేలా మాజీ సర్పంచ్, ఆమె భర్త బండారు నరసింహనాయుడు బ్యాంకు రుణాలు పొందారని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నాడని 11 మంది గ్రామస్తులు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

### ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు రొంగలి సూర్యనారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డి.గోవిందరావు, టీవీ సత్యారావు, శ్రీను, అప్పారావు, విజయ, అన్నపూర్ణ, భవాని, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

### ఎస్పీ కార్యాలయానికి 45 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి:** ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 అర్జీలు వచ్చాయి. తన కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు, మోసపూరిత వ్యవహారాలు, తదితర అంశాలపై 45 అర్జీలు వచ్చాయన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నాళ్లు అర్జీ పెట్టుకోవాలి



20 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఇంటికి గతంలో రూ.15 వేలు చెల్లించాను. నా పేరున మంజూరైన ఓటీఎస్ సర్టిఫికెట్‌ను ఇప్పటికి సచివాలయం సిబ్బంది ఇవ్వడం లేదు. కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు అందిస్తున్నా నేటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. నా కుమారెడితో వచ్చి మళ్లీ అర్జీ పెట్టా. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓటీఎస్ సర్టిఫికెట్ అందించాలి.

– **పోతురాజు వరహాలమ్మ**, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం మండలం

### ఎన్టీఆర్ ఆస్పత్రిలో నిత్యం వైద్యులు ఉండాలి



జిల్లా కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్యులు రోజంతా విధుల్లో ఉండాలి. జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగులకు నిరంతరం సేవలు అందించాలి. మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఒంటి గంట దాటితే ఓపీ సేవలు నిలిపేస్తున్న వైద్యులు.. సాయంత్రం సమయాల్లో మాత్రం ప్రైవేటు క్లినిక్‌లలో ఉంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేదవారికి వైద్యం అందడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు ప్రైవేటు క్లినిక్‌లలో పని చేయకుండా చర్యలు తీసుకోవాలి.

–**బి.తాతయ్య**, పూడిమడక గ్రామం, అచ్యుతాపురం మండలం

## వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు, అబిద్‌సెంటర్‌లో మానవహారం

**నర్సీపట్నం:** నూతన వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. సోమవారం నర్సీపట్నంలో వారు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని జామియా మసీదు నుంచి కృష్ణాబజార్, అబిద్‌సెంటర్, ఆర్డీవో కార్యాలయం మీదుగా శ్రీకన్య జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో కార్యాలయం మెయిన్ గేటు రోడ్డుపై బైఠాయించి ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జాతీయ జెండాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి వక్ఫ్ సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ నూతన చట్టంతో వక్ఫ్ బోర్డులకు ఉన్న ఆర్థిక స్వేచ్ఛను పూర్తిగా హరిస్తుందన్నారు. ఈ చర్యను ముస్లిం లా బోర్డు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. చాలా రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కబ్జా చేసి పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. దీనిని తక్షణమే రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## డీఐఈవోల నియామకం

**విశాఖ విద్య:** విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా గుర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆర్.సురేష్‌కుమార్‌ను పదోన్నతిపై విశాఖ జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారిగా నియమించారు. అలాగే రాజమండ్రి కేంద్రంగా ఇంటర్మీడియెట్ విద్య రీజినల్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా డీవీఈవోగా విశాఖలో పనిచేస్తున్న బి.రాధను అనకాపల్లి జిల్లా డీఐఈవోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. విజయనగరం డీవీఈవోగా పనిచేస్తున్న కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.బి.శంకర్‌రావును అల్లూరి సీతారామరాజు జిల్లా డీఐఈవోగా నియమించారు.

## మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

**నేచురేడ్ ఫుడ్స్ పరిశ్రమ ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకుల ఆందోళన**



నేచురేడ్ ఫుడ్స్ ఎదుట బాధిత కుటుంబంతో కలిసి ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**యలమంచిలి రూరల్:** యలమంచిలికి సమీపంలో బీపీసీఎల్ పెట్రోల్ బంక్ పక్కనున్న నేచురేడ్ ఫుడ్స్ పరిశ్రమ ఎదుట సోమవారం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ పరిశ్రమలో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పెదపల్లికి చెందిన బొద్దపు త్రినాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పెదపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు,బాధిత కుటుంబసభ్యులు పరిశ్రమ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి శాంతింపజేశారు. వివరాలివి.. యలమంచిలి మండలం మర్రిబంద నేచురేడ్ ఫుడ్స్ పరిశ్రమలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి బొద్దపు త్రినాథ్ గత జనవరి 12వ తేదీన పరిశ్రమలో అధికారులు అప్పగించిన పనిపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రోజువారీ కూలీగా పనిచేస్తున్న త్రినాథ్ మృతితో అతని కుటుంబం రోడ్డున పడింది. మృతునికి భార్య దేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాదం జరిగినపుడు త్రినాథ్ మృతదేహంతో కుటుంబానికి న్యాయం చేయాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. అప్పట్లో పరిశ్రమ ప్రతినిధులు పెద్ద దిక్కు కోల్పోయిన త్రినాథ్ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పి అంత్యక్రియలకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు బాధిత కుటుంబానికి ఎలాంటి సహాయం అందించలేదు. యాజమాన్యం నుంచి సరైన స్పందన లేకపోవడంతో సోమవారం మృతుని భార్య, పిల్లలతో పాటు పెదపల్లి, యలమంచిలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న యలమంచిలి పట్టణ ఎస్ఐ కె.సావిత్రి, సిబ్బంది అక్కడకు చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. అనుమతి లేకుండా ఇలాంటి ఆందోళనలు చేయడం సబబు కాదన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ నాయకులు దాసరి కుమార్, గణేష్, రమణ, అచ్యుతరావు, నర్సింహమూర్తి, త్రినాథ్ పాల్గొన్నారు.

## ఆర్.వెంకయ్యపాలెం పాఠశాలలో వసతులు కల్పించాం

**జాతీయ బాలల హక్కుల కమిటీకి ఫిర్యాదుపై డీఈవో, ఆర్డీవో విచారణ**



ఆర్.వెంకయ్యపాలెం పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో అప్పారావునాయుడు, ఆర్డీవో రమణ

**నాతవరం:** మండలంలో జిల్లేడుపూడి పంచాయతీ ఆర్.వెంకయ్యపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. ఇక్కడ విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేవని, 2023లో అప్పటి పేరెంట్స్ కమిటీ చైర్మన్ న్యూఢిల్లీలోని జాతీయ బాలల హక్కుల కమిటీకి ఫిర్యాదు చేయగా, క్షేత్రస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టరుకు సమాచారం వచ్చింది. కలెక్టరు ఆదేశాల మేరకు పాఠశాలను డీఈవో, ఆర్డీవో సోమవారం పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను విచారించారు. రూ.12 లక్షలతో పాఠశాల భవనం నిర్మించామని, మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామని విచారణ అధికారులు తెలిపారు. పాఠశాలకు ప్రహరీ లేదని, దానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను కలెక్టరుకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో నాతవరం ఎంఈవోలు ఓ సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు, ఉపాధ్యాయులు శెట్టి సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## సారా స్థావరాలపై మెరుపు దాడులు



సారా పులుపును ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**రావికమతం:** అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సుర్జీత్ సింగ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ ఆదేశాల మేరకు మాడుగుల ఎక్సైజ్ పోలీసులు రావికమతం మండలం మేడివాడ గ్రామ శివారులో జీడి తోటల్లోని నాటు సారా స్థావరాలపై సోమవారం మెరుపు దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు వి.మాడుగుల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో మేడివాడ గ్రామానికి చెందిన గేడి చిన్నా, గేడి రమణను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

## 34 హైస్కూళ్లలో లైబ్రరీ భవనాల నిర్మాణం



గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

**నాతవరం:** జిల్లాలో 34 హైస్కూళ్లలో లైబ్రరీలకు అదనపు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఆయన మండలంలో డి.యర్రవరం హైస్కూల్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు, విద్యా బోధన తదితర అంశాలను ప్రధానోపాధ్యాయిని ఆకుల కుమారిని అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్ ప్రాంగణంలో రూ.23 లక్షలు వ్యయంతో నిర్మాణ దశలో ఉన్న లైబ్రరీ నూతన భవన నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. భవన నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్‌ను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 34 హైస్కూళ్లలో నూతనంగా గ్రంథాలయం లేదా ల్యాబ్‌లకు సంబంధించిన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కొన్ని హైస్కూళ్లకు గ్రంథాలయ భవనం ఉంటే కొత్తగా నిర్మించే భవనాన్ని కెమిస్ట్రీ ల్యాబ్‌కు ఉపయోగించడం జరుగుతుందన్నారు. ప్రతి హైస్కూల్‌కు విధిగా ల్యాబ్, గ్రంథాలయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘సూపర్‌సిక్స్’లో నిరుద్యోగ భృతి అమలెప్పుడు?



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, తదితరులు

**అనకాపల్లి:** సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చి 11 నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి ధ్వజమెత్తారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో 17వ జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు మే 15 నుంచి 18వ తేదీ వరకూ తిరుపతిలో జరుగుతాయన్నారు. 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే నిరుద్యోగ భృతి అందజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ శాఖల్లో పని చేసే వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులను కూటమి ప్రభుత్వం తొలగించడం అన్యాయమన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు, అర్జిల్లి జగదీష్, బొంది సింహాద్రి, పెంటకోట సంతోష్, పాత్రపల్లి వెంకటేష్, ఎస్.కృష్ణ, బి.ప్రసాద్, విత్తనాల పోతురాజు, ఎల్.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



దెబ్బతిన్న లారీని పరిశీలిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

**కశింకోట:** కశింకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతి కష్టం మీద బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేరళ నుంచి ఒడిశా వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీ వేగంగా వచ్చి ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. దీంతో తమిళనాడు లారీ డ్రైవర్ ముత్తు స్వామి పళని కాలు విరిగి తీవ్రంగా గాయపడి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు ఆయనను అతి కష్టం మీద బయటకు తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలంలో నిలిచిపోయిన లారీని రెండు జేసీబీల సహాయంతో అడ్డు తొలగించారు. ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతింది. సంఘటన వల్ల నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పోలీసులు సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి క్రమబద్ధీకరించారు.

## 25 కిలోల గంజాయితో నలుగురు అరెస్టు



గంజాయితో పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

**రోలుగుంట:** దిబ్బలపాలెంలో గంజాయి వ్యాపారులపై స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు సోమవారం దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. వివరాలివి. దిబ్బలపాలేనికి చెందిన చవ్వాకుల చిన్నమ్మలు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇంటికి తీసుకొచ్చి నిల్వ చేసి ప్యాకెట్ల రూపంలో విక్రయాలు చేస్తోంది. ఇదే మండలం జె.నాయుడుపాలేనికి చెందిన వడ్డాది సాయి, బంగారు పవన్ అనే వ్యక్తుల సాయంతో మద్దిగరువు ప్రాంతం వెళ్లి పెదబయలు మండలం తగ్గుపాడుకు చెందిన కిలో తిమోతి వద్ద 25 కేజీల గంజాయి కొనుగోలు చేసి, మైదాన ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా నలుగురు వ్యక్తులను కొంతలం కూడలి వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయితో పాటు రవాణాకు వినియోగించిన రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు వివరించారు.

**10 కిలోల గంజాయితో మైనర్ అరెస్టు**

**చీడికాడ:** 10 కిలోల గంజాయితో ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. ముందస్తు మేరకు కోనాం పంచాయతీ గుడివాడ బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహించగా పెదబయలు మండలం గొమంగి పంచాయతీ చావిడిమామిడికి చెందిన మైనర్ బాలుడు స్కూటీపై 10 కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. ఆ బాలుడిని విచారించగా తనకు రూ.5వేలు అవసరం కాగా స్కూటీ యజమాని అయిన పెదబయలుకు చెందిన వ్యక్తిని సంప్రదించడంతో గంజాయిని అనకాపల్లి వరకు తరలించి అప్పగిస్తే ఆ నగదు ఇస్తానని చెప్పాడన్నారు. పరారీలో ఉన్న ఆ వ్యక్తిని పట్టుకుంటామని ఎస్ఐ చెప్పారు.

## ఎస్పీకి పోలీస్ సంఘం ప్రతినిధుల వినతి



జిల్లా పోలీస్ సంఘం ప్రతినిధులతో ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి:** జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ త్వరలో పోలీస్‌స్టేషన్లు పరిశీలించి సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం సభ్యులు శేషగిరిరావు, లలిత, జిల్లా కమిటీ సభ్యులు మొహిద్దీన్, అచ్చయ్య, శేషాద్రి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కొట్లాటకు దారి తీసిన ఆస్తి తగాదా

**రావికమతం:** మట్టవానిపాలెంలో ఆస్తి పంపకం విషయమై వివాదం తలెత్తి రెండు కుటుంబాల మధ్య కొట్లాటకు దారి తీసింది. మధ్యవర్తిత్వం వహించిన తలారి చిన్నారావుపై ఓ వర్గం వారు కర్రలు, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తలారి ముసిలిబాబు కుటుంబీకుల మధ్య ఆస్తి పంపకాల విషయమై వివాదం జరుగుతోంది. ఈ పంపకాల్లో చిన్నారావు మధ్యవర్తిత్వం చేశారు. దీంతో మరో వర్గం వారు అతడిపై కక్ష పెంచుకొని పశువుల పాక వద్ద కుడితి బకెట్ కోసం అంటూ తలారి చిన్నారావు, మలిచెట్ల గౌరీ కుటుంబాల మధ్య వివాదం జరిగింది. మలిచెట్ల వెంకటేష్, తలారి చిన్నారావు కొట్టుకున్నారు. చిన్నారావు తలకు గాయమైంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కలప తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**రావికమతం:** కల్యాణపులోవ అటవీ ప్రాంతం నుంచి కలప అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్టు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం రాత్రి కళ్యాణపులోవ ప్రాంతం నుంచి ట్రాక్టర్లతో కలపను అక్రమంగా తరలిస్తుండగా అక్కడి గిరిజనులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం పోలీసు సిబ్బందితో వెళ్లి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఆయా ట్రాక్టర్లు ఆర్.కొత్తూరుకు చెందినవిగా గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు.

## క్లుప్తంగా

### స్థిరంగా కూరగాయల ధరలు

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయలు దాదాపు స్థిర ధరలకు అమ్మకాలు సాగాయి. కిలో టమాటా రూ.20, ఉల్లి, వంకాయ, క్యాబేజీ రూ.30, దొండకాయ, బెండకాయ రూ.40, బీట్‌రూట్, క్యారెట్ రూ.60, బీన్స్ రూ.80, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి.

### అధికారులు అందుబాటులో లేక ఇబ్బందులు

**కశింకోట:** రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండల ప్రజలు కశింకోట వచ్చి ఇక్కడ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో పనులు జరగక ఇబ్బంది పడుతూ ఇంటి ముఖం పట్టాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

### ఉష్ణతాపానికి విలవిల



వెలవెలబోయిన ప్రధాన రహదారి

**కశింకోట:** వేసవి తాపం మళ్లీ పెరగడంతో సోమవారం మండల ప్రజలు సతమతమయ్యారు. కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు కురిసి వాతావరణం చల్లగా ఉంది. మళ్లీ ఒక్కసారిగా వేసవి తాపం పెరిగింది. ఇక్కడ అధిక ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఉదయం 11 గంటల నుంచి సూర్యతాపంతో ప్రజలు ఇళ్ల నుంచి రోడ్డుపైకి రావడానికి సాహసించలేదు. ఏదో అత్యవసర పనులు ఉన్నవారు తప్ప మిగిలిన వారు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలో ప్రధాన రహదారులు, వీధులు జనసంచారం లేక వెలవెలబోయాయి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎండ తీవ్రత తగ్గడంతో క్రమేపి ప్రజలు ఇళ్లు విడిచి తమ నిత్య కార్యకలాపాలు సాగించుకున్నారు.

### నేడు జాబ్‌మేళా

**అనకాపల్లి:** జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జాబ్‌మేళా కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక గవరపాలెం ఏడీ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవింద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు విచ్చేస్తారన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఆక్రమణ తొలగించాలని ఫిర్యాదు

**మాకవరపాలెం:** ప్రభుత్వ స్థలం ఆక్రమణను తొలగించాలని సర్పంచ్ అల్లంపల్లి శిరీష తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పశువైద్య కేంద్రం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైందని, సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం సభ్యులు అనధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను నిలుపుదల చేయాలని ఎంఈవోకు ఫిర్యాదు చేశారు.

### బెల్లం ధరలు



**అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 2,398 దిమ్మలు వచ్చాయి.**

| దిమ్మల రకం | కనిష్టధర | గరిష్టధర |
|---|---|---|
| మొదటి రకం | 3,900 | 4,460 |
| రెండో రకం | 3,310 | 4,140 |
| మూడో రకం | 2,900 | 3,300 |

### అనకాపల్లి సినిమాలు

రాజా : మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : కోర్టు
శ్రీసత్య : మధురం
రామచంద్ర : జాక్

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-9 యూనిట్లు, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 354 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

# వాహనాలకు ఎండ దెబ్బ




**అనకాపల్లి టౌన్:** అధిక ఎండలకు మనుషులకే కాదు వాహనాలకు ప్రమాదం పొంచి ఉందని వాహన రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వల్ల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నట్లే వాహనాలను ఎండలో పార్కింగ్ చేస్తే ట్యాంకులు, టైర్లు పేలే అవకాశం లేకపోలేదు. ఎండలో ప్రయాణించేటప్పుడు పెట్రోల్, డీజిల్ లీకై ఏ చిన్న నిప్పు రవ్వ పడ్డా పెను ప్రమాదం సంభవిస్తుంది. ఎండల నుంచి మనం ఎలా రక్షణ తీసుకుంటామో వాహనాలకూ అదే రీతిలో రక్షణ చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులు, నిపుణులైన మెకానిక్‌లు సూచిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణాలు చేయవద్దని చెపుతున్నారు.

**ద్విచక్ర వాహనదారులు ఇవి కచ్చితంగా పాటించాలి**

ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా చెట్లు, షెడ్ల నీడలోనే పార్కింగ్ చేయాలి. టైర్లలో గాలిని తగ్గించుకోవాలి. వాహనాలను గంటల తరబడి ఎండలో ఉంచితే రంగు కోల్పోతాయి. మళ్లీ రంగులు వేయించుకోవాలంటే అధిక మొత్తం నగదు వెచ్చించాలి. ఎండలో ఎక్కువ సేపు నిలిపి ఉంచితే వాహనాల ట్యాంకుల్లో పెట్రోల్ ఆవిరి అవుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫుల్ ట్యాంక్ కొట్టించరాదు. రాత్రి వేళల్లో పెట్రోల్ ట్యాంక్ మూతను ఒకసారి తెరిచి మరలా మూసివేయాలి. దీనివల్ల ట్యాంక్‌లోకి చేరిన గ్యాస్ పోతుంది.

**◆ ఇంజన్ ఓవర్ హీట్ వల్ల ప్రమాదాలు**

కార్లు, లారీలు, ఆటోల యజమానులు ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వేసవిలో ఇంజన్ ఓవర్ హీట్ వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తాయి. ఎక్కువ సేపు వాహనాలను నడపరాదు. వాహనాలను ఎండలో ఉంచితే ట్యాంకులో 40 శాతం ఇంధనం ఆవిరవుతుంది. వాహనాల రేడియేటర్లలో తగినన్ని నీళ్లు ఉండేలా చూసుకోవాలి. లేదంటే ఎండలకు ఇంజన్‌లు తరచుగా ఆగిపోయే అవకాశం ఉంటుంది. ఎండ వేడికి ఇంజన్ ఆయిల్ తగ్గిపోతుంది. ఎల్పీజీ వాహనాలు పూర్తిగా వాడకపోవడం మంచిది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బైకులు, కార్లు వినియోగం పెరుగుతుంది. బ్యాటరీలను చార్జింగ్ పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. బ్యాటరీ వేడిగా ఉన్నప్పుడు చార్జింగ్ పెట్టకూడదు. షార్ట్ సర్క్యూట్ వల్ల అవి పేలిపోయే ప్రమాదం ఉంది.



పట్టణంలో ఎండలో పార్కింగ్ చేసిన వాహనాలు

### ఇంజిన్ ఆయిల్ తనిఖీ చేస్తూ ఉండాలి



వాహనదారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంజిన్ ఆయిల్ ఎండ వేడిమికి పల్చగా మారి శక్తిని కోల్పోతుంది. 15 రోజులకోసారి ఇంజిన్ ఆయిల్ తనిఖీ చేస్తూ ఉండాలి. ద్విచక్ర వాహనాలను ఎక్కువ సమయం ఎండలో ఉంచడం వల్ల పెట్రోలు ఆవిరైపోతుంది. పెట్రోలు మధ్యాహ్నం కంటే సాయంత్రం వేళలో పోసుకోవడం మంచిది. టైర్లలో గాలి విషయంలో ఆలస్యం ప్రదర్శిస్తే మన్నిక తగ్గిపోతుంది. ఎండలో ఎక్కువ దూరం ప్రయాణించరాదు. బైక్‌లను నీడలో మాత్రమే పార్కింగ్ చేయాలి. రీ బటనింగ్ టైర్లను ఉపయోగించరాదు.

–పి. రాజు, బైక్ మెకానిక్

### సెల్లార్లు లేక ఎండలోనే పార్కింగ్



పట్టణంలో ఎక్కడా సెల్లార్లు లేవు. బ్యాంక్, హోటల్, ఇలా ఎక్కడికి వెళ్లినా ఎండలోనే పార్కింగ్ చేయాల్సి వస్తుంది. అధికారులు చర్యలు తీసుకుని సెల్లార్లలో పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

–శ్రీను, వాహనదారు, అనకాపల్లి

## ఉపాధి నిధులతో తాండవ కాలువలో పూడికతీత



తాండవ కాలువలో పూడికతీత పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**నాతవరం:** తాండవ కాలువలో ఉపాధి హామీ పథకం నిధులతో పూడికతీత పనులు చేపట్టినట్టు ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండలంలో చమ్మచింత పంచాయతీ శివారు తాండవ ప్రాంతంలో తాండవ ప్రధాన కాలువలో పూడికతీత పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో 19 పనులు కోటి 50 లక్షలతో పూడికతీత పనులు చేస్తామన్నారు. 52 వేలు పని దినాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, చమ్మచింత మాజీ ఎంపీటీసీ సభ్యుడు నూకరాజు, తాండవ నీటి సంఘం అధ్యక్షుడు మిడతాన ప్రసాద్, రైతులు, తాండవ సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుధాన్యాల్లో అధిక పోషకాలు



డి.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి

**కె.కోటపాడు :** చిరుధాన్యాలతో కూడిన ఆహారంలో అధికంగా పోషక విలువలు ఉంటాయని డి.అగ్రహారం అంగన్‌వాడీ కార్యకర్త వేచలపు వెంకటలక్ష్మి అన్నారు. గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండేందుకు ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకే లభించే ముడి దినుసులతో పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమం డి.అగ్రహారం, దీక్షితులపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు వి.వెంకటలక్ష్మి, పి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ జరిపారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బేగం, ఆయా రామలక్ష్మి పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి



అంబేడ్కర్ సేవారత్న అవార్డు గ్రహీత అప్పారావును సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

**దేవరాపల్లి :** రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడి, మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, డా. బిఆర్. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ్ భాస్కర్ అన్నారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం ఆవరణలో సోమవారం అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జయంతోత్సవాల సభను ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనం నిర్మాణం, జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు, పార్కు స్థలంలో బుద్ధుడి విగ్రహం నెలకొల్పేందుకు అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవా రత్న అవార్డు అందుకున్న కాటపల్లి అప్పారావును పలువురు నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. బహుజన కళా మండలి సభ్యులు ఆలపించిన పలు చైతన్య గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు, ఎంఈవో పడాల్‌దాస్, సర్పంచ్ పెంటమ్మ, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ డా.సింహాచలం నాయుడు, ఎల్లేటి కరుణాకర్‌రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, గండిపడాల అప్పలరాజు, వేమల కన్నబాబు, దళిత నాయకులు గొల్ల ఈశ్వరరావు, మరువాడ ఈశ్వరరావు, పతివాడ నాగభూషణం, కార్లి సాయి సుందరరావు, సబ్బవరపు మాలిబాబు, కొండలరావు, కంచిమాల అప్పారావు, కాటపల్లి ఈశ్వరరావు, మచ్చ వీర్రాజు, రామారావు పాల్గొన్నారు.

## 26న చోడవరంలో మెగా జాబ్‌మేళా

**చోడవరం :** నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 26వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు సోమవారం తెలిపారు. చోడవరం గవర్నమెంటు కాలేజీ ఆవరణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్‌మేళా ప్రారంభమౌతుందని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులంతా తమ విద్యార్హతతో కూడిన సర్టిఫికెట్లు తీసుకొని మేళాకు హాజరవ్వాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు కలిగి 10వ తరగతి పై చదువులు చదువుకొని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతీ, యువకులంతా ఈ జాబ్‌మేళాను సద్వినియోగంచేసుకోవాలన్నారు. ప్రముఖ కంపెనీలన్నీ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని చెప్పారు.

## వేచలం హైస్కూల్‌కు కంప్యూటర్ల వితరణ

**దేవరాపల్లి:** వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నానికి చెందిన ఎస్ఎస్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ఐదు కంప్యూటర్లు, లేజర్ ప్రింటర్‌తో పాటు పది టేబుళ్లు, పది కుర్చీలను బహూకరించారు. హెచ్ఎం దేవుపల్లి నర్సింహామూర్తి సమక్షంలో సోమవారం వాటిని అందజేశారు.



పట్టణంలో నిర్మించిన టిడ్కో గృహాలు

# టిడ్కో గృహాలు.. సాకారమెప్పుడు!

ముందుకు సాగని మౌలిక సదుపాయాల కల్పన

లబ్ధిదారుల ఎదురు చూపు

**నర్సీపట్నం :** కూటమి ప్రభుత్వం కొలువు తీరి సుమారు ఏడాది కావస్తున్నా టిడ్కో గృహ నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి లేదు. టిడ్కో గృహాల సాకారం కోసం లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు ముందుకు సాగడం లేదు. 2014లో టిడ్కో గృహ నిర్మాణాలను టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కిటికీలు, తలుపులు, టైల్స్, వైరింగ్, పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో మౌలిక సదుపాయాల పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు ఏడాది అవుతున్నా మౌలిక సదుపాయాల ఊసెత్తడం లేదు.

నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలెం, బలిఘట్టం వద్ద 2016లో టీడీపీ ప్రభుత్వం రూ.150 కోట్లతో 1800 టిడ్కో గృహ సముదాయాన్ని ప్రారంభించింది. సకాలంలో పూర్తి చేయకపోవడంతో వివిధ దశల్లో గృహాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పట్లో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అసంపూర్తిగా ఉన్న ప్లాట్లను డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయించారు. అసంపూర్తిగా ఉండడంతో లబ్ధిదారులు ఎవరూ ఇళ్లల్లోకి వెళ్లలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మాణాలను పూర్తి చేసింది. ఎన్నికలు సమీపించడంతో మౌలిక సదుపాయాలకు బ్రేక్ పడింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాలను గాలికి వదిలేసింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఓవర్ హెడ్ ట్యాంకు, ప్రధాన, అంతర్గత రోడ్లు, నీటి సరఫరా, డ్రైయిన్ల కల్పనకు రూ.20.31 కోట్లు, ఎస్టీపీ ట్యాంకులు నిర్మాణంకు రూ.4.85 కోట్లు అవసరమవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. ప్రభుత్వ వైఖరితో లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి.

### నిధుల కొరత ఉంది

మౌలిక సదుపాయాలకు నిధుల కొరత ఉంది. పెండింగ్ బిల్లులు ఉండడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాల వస్తే సత్వరం పనులు చేపడతాం.

– సంధ్య, టిడ్కో డీఈ

## ప్రతిభను మరింత మెరుగుపరచుకోవాలి



ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

**కశింకోట:** విద్యార్థులు తమ ప్రతిభను రోజు రోజుకు మెరుగుపరచుకోవడానికి కృషి చేయాలని వెదురుపర్తి హెచ్ఎం ఎ.వి.ఎస్. మూర్తి తెలిపారు. మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన వార్షిక పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి పతకాలు, జ్ఞాపికలను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ చూపడంలో ఇతర విద్యార్థులతో పోటీ పడరాదన్నారు. చిన్నపాటి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను బహుమతులతో ప్రోత్సహించి ఉన్నత ఆశయాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యార్థి విద్యనభ్యసించడం అనేది 'అభ్యాసన-మూల్యాంకనం-ప్రోత్సాహకాలు' అందించు పద్ధతిలో బోధన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉన్నత తరగతులకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కశింకోట:** మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా ఈ నెల 23న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లితోపాటు చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, ఏనుగుతుని, నూతలగుంటపాలెం, సోమవరం, ఏఎస్ పేట, చిన ఏనుగుతుని, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, పేరంటాలపాలెం గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. మరమ్మతులు కారణంగా తాళ్లపాలెం పరిధిలోని వ్యవసాయ రంగానికి ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలన్నారు.

## మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలి




ఆందోళనలో పాల్గొన్న ఐద్వా మహిళ సంఘం ప్రతినిధులు

### ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన

**పరవాడ:** స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మద్యం, మత్తు పదార్థాల్ని నియంత్రించి, తక్షణమే బెల్ట్ షాపులను తొలగించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, తినడానికి తిండి దొరక్కపోయినా తాగడానికి మద్యం మాత్రం ఎక్కడపడితే అక్కడ లభ్యమవుతోందని ఆక్షేపించారు. గుడికి బడికి తేడా లేకుండా అడుగుకో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి ప్రజల్ని మద్యం మత్తులో ముంచుతున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి, రేషన్ కార్డుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ అధ్యక్షురాలు బి.బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, లావణ్య, సీతామహాలక్ష్మి, లక్ష్మి, శ్రీదేవి, ప్రియాంక, నాగమాల, శ్రావణి, లక్ష్మి, హేమలత, వరలక్ష్మి, మంజుల, మణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

ఎ.కొత్తపల్లిలో హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ బుల్లిలక్ష్మి,బ సర్పంచ్ సత్య వెంకటరమణ

**దేవరాపల్లి:** బడి ఈడు పిల్లలందర్నీ సర్కారు బడిలో చేర్పించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి కోరారు. ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్లకార్డులు పట్టుకొని నినదించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాకు పని కల్పించండి మహాప్రభో...

- మేట్ మార్పును వ్యతిరేకించినందుకు వీఆర్‌పీ వివక్ష



మస్టర్ నమోదు చెయ్యకపోయినా పనిచేస్తున్న చంద్రదేవి గ్రూపు సభ్యులు



పని కల్పించాలంటూ రోడ్డెక్కిన కూలీలు

**చీడికాడ :** తమకు తెలియకుండా మేట్‌ను మార్చడంపై వీఆర్‌పీకి వ్యతిరేకంగా ధర్నా చేసి ఫిర్యాదు చేసిన కూలీలకు పని కల్పించకుండా మస్టర్ నమోదు చేయలేదంటూ బైలపూడికి చెందిన చంద్రాదేవి గ్రూపు ఉపాధి కూలీలు ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ తమకు తెలియకుండా వీఆర్‌పీ, ఏపీఓలు తమ గ్రూపు మేట్ జె.చంద్రాదేవిని తొలగించి ఆమె స్థానంలో గాడి వరలక్ష్మిని నియమించడంతో నాలుగు రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయం వద్ద వీఆర్‌పీకి వ్యతిరేకంగా కూలీలు ధర్నా నిర్వహించారు. దీనిపై విచారణ చేస్తామని అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం పనికోసం 16 మంది కూలీలు వెళ్లారు. వెళ్లిన కూలీలను వీఆర్‌పి గాడి సత్యనారాయణ కొత్తగా నియమించిన మేట్‌తో ఫొటోలు తీసుకుంటేనే పని కల్పించి మస్టర్ నమోదు చేస్తామనడంతో తాము ఒప్పుకోలేదని జాజిమొగ్గల చంద్రాదేవి, అప్పారావుతో పాటు కూలీలు తెలిపారు. అయితే మీకు పని కల్పించనని వీఆర్‌పి చెప్పాడన్నారు. ఈ విషయాన్ని ఏపీవో గంగునాయుడు, ఎంపీడీఓ హేమసుందరరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మేట్‌తో సంబంధం లేకుండా పని కల్పిస్తామని చెప్పిన ఏపీవో, ఎంపీడీఓ స్పందించలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

### మందుబాబులకు జరిమానా

**పెందుర్తి:** పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 13 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.1.30 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.